సాక్షి ఏలూరు

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



సోమేశ్వరుడి సన్నిధిలో..

భీమవరం(ప్రకాశంచౌక్): పంచారామక్షేత్రం సోమేశ్వర జనార్దనస్వామి ఆలయాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి శనివారం సందర్శించారు.



స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

బుట్టాయిగూడెం వద్ద స్కూల్ బస్సును లారీ వెనుక నుంచి ఢీ కొట్టింది. విద్యార్థులకు ఏ ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. 8లో ▸

వరాల వెంకన్నకు పూజలు

అత్తిలి: అత్తిలి మండలం ఈడూరులోని వరాల వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.



న్యూస్‌రీల్

నేడు పెద్దింట్లమ్మ వారధి ప్రారంభం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జయమంగళ

కై కలూరు: కొల్లేరు ప్రజల చిరకాల వాంఛ సర్కారు కాల్వపై పెద్దింట్లమ్మ వారధి వంతెన, కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద అతిపెద్ద అనివేటి మండపం ప్రారంభోత్సవాలు ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రారంభం కానున్నాయి. పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌చార్జి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ ముఖ్య అతిథులుగా రానున్నారు. మండపం వద్ద ఏర్పాట్లను శనివారం ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎమ్మెల్యే డీఎన్నార్ కుమారులు వినయ్, శ్యామ్, ఆలయ ఈఓ కందుల వేణుగోపాలరావు, నాయకులు సయ్యపురాజు గుర్రాజు పరిశీలించారు.

ప్రశాంతంగా నవోదయ పరీక్ష

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2024–24 విద్యా సంవత్సరంలో 9వ తరగతి, ఇంటర్మీడియెట్‌లలో చేరేందుకు శనివారం ప్రవేశ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. జిల్లాలోని 6 కేంద్రాల్లో 9వ తరగతిలో ప్రవేశాల కోసం ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు పరీక్ష నిర్వహించగా 1,021 మందికి 516 మంది హాజరయ్యారు. ఇంటర్మీడియెట్‌లో ప్రవేశాల కోసం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా 501 మందికి 302 హాజరయ్యారు. పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్ కేసులూ నమోదు కాలేదని ఏలూరు డీఈఓ ఎస్.అబ్రహం తెలిపారు.

నరసాపురంలో ఏటిగట్టు కుంగలేదు

నరసాపురం: నరసాపురం పట్టణం పొన్నపల్లి వద్ద వశిష్ట గోదావరి ఏటిగట్టు పటిష్ట పనులు జరుగు తున్న ప్రాంతంలో గట్టు కుంగిందంటూ జరుగుతున్న ప్రచారంలో నిజం లేదని కన్జర్వెన్సీ చీఫ్ ఇంజనీర్ ఆర్.సతీష్‌కుమార్ చెప్పారు. ప్రతిపక్షాల ఆరోపణల్లో నిజం లేదని, గోదావరి పరివాహక ప్రాంతం ప్రజలు భయపడ్డాన పనిలేదన్నారు. శనివారం సతీష్ కుమార్‌తో పాటు గోదావరి డెల్టా సెక్షన్స్ ప్రభుత్వ సలహాదారు ఎం.గిరిధర్‌రెడ్డి మరికొంతమంది కన్జర్వెన్సీ ఇంజనీర్ల బృందం పొన్నపల్లి గోదావరి ఏటిగట్టు ప్రాంతాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ 2022 వరదల సమయంలో స్థానికంగా ఏటిగట్టు కోతకు గురికావడంతో ప్రభుత్వం గట్టు పటిష్టతకు రూ.26 కోట్లు మంజూరు చేసిందన్నారు. టెండర్ ప్రక్రియ నిర్వహించి పనులు చేపట్టామన్నారు. పనులు జరుగుతున్నప్పుడు నేల స్వభావాన్ని బట్టి వేసిన రాళ్లు జారుతుంటాయని వివరించారు. అలా జారితేనే రాళ్లు నేలలో కుదురుకుని గట్టు పూర్తి పటిష్టం అవుతుందన్నారు. పనులు ఇంకా పూర్తికాలేదన్నారు. పని జరుగుతున్నప్పుడు వేసిన రాళ్లు జారుతుంటే గట్టు కుంగిపోతుందని, నాసిరకం రాళ్లు ఉపయోగిస్తున్నారని, అవినీతి జరిగిందని ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఈ విమర్శల్లో నిజం లేదన్నారు. పూర్తి నాణ్యతతో పారదర్శకంగా పనులు సాగుతున్నాయని చెప్పారు.

స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఉద్యోగాలు

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే వన్‌స్టాప్ సెంటర్ నరసాపురంలో కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ పద్ధతిపై పనిచేసేందుకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు జిల్లా మహిళా, శిశు సంక్షేమ సాధికారత అధికారి బి.సుజాతరాణి తెలిపారు. అభ్యర్థులు westgodavari.ap.gov.in నుంచి దరఖాస్తులు డౌన్‌లోడు చేసుకుని పూర్తిచేసి ధ్రువీకరణ పత్రాలతో సమర్పించాలన్నారు.

ఉద్యోగ ప్రాప్తిరస్తు

- గ్రామీణ విద్యార్థులకు ఉద్యోగాలు
- జిల్లాలో 3,418 మందికి శిక్షణ
- 2,457 మందికి ఉద్యోగావకాశాలు
- సీడాప్ ద్వారా ప్రత్యేక శిక్షణ
- ఉన్నత సంస్థల్లో కొలువులు



విజయీభవ.. సీడాప్ శిక్షణ పొందిన యువతులు

ఏలూరు (మెట్రో): ప్రజల సంక్షేమంతో పాటు అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం బాటలు వేస్తోంది. ప్రతి కుటుంబం అభ్యున్నతిని కాంక్షిస్తూ గ్రామీణ విద్యార్థులకు ఉద్యోగావకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించింది. దీనిలో భాగంగా జిల్లావ్యాప్తంగా పేద, గ్రామీణ ప్రాంతాల్లోని కుటుంబాల్లోని విద్యార్థులను ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దుతోంది. దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ యోజన, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, పంచాయతీ రాజ్ సంస్థల సాంకేతిక మద్దతుతో సొసైటీ ఫర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ అండ్ ఎంటర్‌ప్రైజెస్ డెవలప్‌మెంట్ (సీడాప్) నోడల్ ఏజెన్సీగా ఏర్పాటై గ్రామాల్లో దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న గ్రామీణ యువతకు ఉపాధి కల్పిస్తోంది. పూర్తిస్థాయిలో వెనుకబడిన, గ్రామీణ యువతకు ఉపాధి కల్పించే నిమిత్తం సీడాప్ చర్యలు తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పనిచేస్తున్న స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాలు, మండల సమాఖ్యలు ద్వారా గ్రామాల్లో ఉన్న నిరుద్యోగ యువతపై దృష్టి సారిస్తోంది.

ఆసక్తి ఉన్న రంగాల్లో..

జిల్లా అధికారులు, సీడాప్ సంస్థ ఉద్యోగులు కలిసి అభ్యర్థులను ఎంపిక చేసి వారికి ఆసక్తి ఉన్న రంగాల్లో శిక్షణ ఇస్తున్నారు. కంప్యూటర్, ఆటోమొబైల్, రిటైల్, మార్కెటింగ్, టూరిజం, హాస్పటలాజీ, ఆక్వాకల్చర్, ఎలక్ట్రికల్, నిర్మాణ రంగాల్లో శిక్షణలు ఇచ్చి ఉద్యోగాలు కలిస్తున్నారు. శిక్షణ కాలంలో సైతం ఉచిత ఆహారం, వసతి, కార్పొరేట్ స్థాయిలో తరగతులు నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాదిలో 951 మందికి..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన 2019 నుంచి జిల్లావ్యాప్తంగా 3,418 మందికి శిక్షణ ఇవ్వగా 2,457 మందికి జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ విజయరాజు ఆధ్వర్యంలో ఉద్యోగాలు అందించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో (2023–24) 951 మందికి శిక్షణ అందించి ఇప్పటికే 511 మందికి ఉద్యోగాలు కల్పించారు. మరో 468 మంది ప్రస్తుతం శిక్షణలో ఉన్నారు.

ప్రభుత్వ సహకారంతోనే..



గ్రామీణ ప్రాంత యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పించడం ఆనందంగా ఉంది. ప్రభుత్వ సాయంతోనే రూ.17 వేల జీతంతో ఉద్యోగం పొంది గుంటూరులో పని చేస్తున్నా. జీతంతో పాటుగా ఇన్సెంటీవ్ ఇస్తున్నారు. ప్రభుత్వం నాలాంటి గ్రామీణ యువతపై దృష్టి సారించడం ఆనందంగా ఉంది.

– టి.మాధవి, వట్లూరు, పెదపాడు మండలం

అధికారుల ప్రత్యేక దృష్టి



ప్రభుత్వం మా కుటుంబాల స్థితిగతులను తెలుసుకుని నాకు శిక్షణ అందించింది. జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించి నాలో ఉన్న భయాన్ని తొలగించి ఉద్యోగం అందించేందుకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం నేను విజయవాడ లలితా జ్యూయలరీలో విధులు నిర్వహిస్తూ నెలకు రూ.16 వేల జీతం సంపాదిస్తున్నా.

– సంధ్య, కూచింపూడి, పెదవేగి మండలం

ఆనందంగా ఉంది



గ్రామీణ ప్రాంతం నుంచి పట్టణ ప్రాంతానికి వెళ్లి విధులు నిర్వహించడం చాలా ఆనందంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వ సాయంతో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా. శిక్షణలో ఇచ్చిన మెలకువలు బాగా ఉపయోగపడ్డాయి. ప్రస్తుతం హైదరాబాద్‌లో పనిచేస్తున్నా. నెలకు రూ.17,500 జీతంతో పాటుగా ఇన్సెంటీవ్ పొందుతున్నా.

– రిషిత, కామయ్యపాలెం, జీలుగుమిల్లి మండలం

కార్పొరేట్ తరహా శిక్షణ



గ్రామీణ యువతపై దృష్టి సారించి వారు ఉద్యోగాల్లో రాణించేలా చర్యలు తీసుకుంటున్నాం. సీడాప్ ఆధ్వర్యంలో కార్పొరేట్ తరహా శిక్షణ అందించేలా చర్యలు తీసుకున్నాం. ఇప్పటివరకు 2,457 మందికి ఉద్యోగాలు కల్పించాం. ప్రస్తుతం మరో వెయ్యి మందికి శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– కె.విజయరాజు, డీఆర్‌డీఏ పీడీ

పటిష్ట ప్రణాళికతో ఎన్నికలకు సిద్ధం

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): జిల్లాలో ఎన్నికల నిర్వ హణకు పటిష్ట ప్రణాళికతో సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ సంసిద్ధతపై శనివారం అమరావతి నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సమీక్షించారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు తీసుకున్న చర్యలను కలెక్టర్ ఆయనకు వివరించారు. జిల్లాలో ఎన్నికల సిబ్బందికి ప్రాథమిక శిక్షణ ఇచ్చామని, నెలాఖరులోపు పూర్తిస్థాయిలో శిక్షణ అందిస్తామన్నారు. జిల్లాలోని 1,191 పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్‌కి ఏర్పాట్లు చేశామన్నారు. మారుమూల ప్రాంతాలైన వేలేరుపాడు, గెడ్డపల్లి వంటి గ్రామాలకు వాహనాల ద్వారా పోలింగ్ సిబ్బంది, సామగ్రిని తరలిస్తామన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. ఫొటో ఓటరు గుర్తింపు కార్డులు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. 502 మంది మైక్రో అబ్జర్వర్లను నియమించామన్నారు. భద్రతా ఏర్పాట్లకు 9,874 మంది పోలీసు సిబ్బంది అవసరం అవుతారని, ఇందుకు జిల్లా ఎస్పీతో సమన్వయం చేసుకుని ఏర్పాట్లు చేస్తామని కలెక్టర్ అన్నారు.

తుది విడత గేట్ పరీక్షలు

తాడేపల్లిగూడెం: పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో గేట్ పరీక్షకు శనివారం ఉదయం 196 మందికి 183 మంది, సాయంత్రం 150 మందికి 130 మంది హాజరయ్యారు.

అనుమానాస్పద స్థితిలో నేపాల్ యువకుడు మృతి

ఏలూరు టౌన్: హోటల్‌లో సహాయ వంట మనిషిగా పనిచేస్తున్న నేపాల్‌కు చెందిన యూటీదోర్జి తమాన్ (22) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తమాన్ రెండు నెలలుగా ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలోని గుమ్మడి రెస్టారెంట్‌లో పనిచేస్తున్నాడు. మృతుని సోదరుడు కొంతకాలంగా ఇక్కడే పనిచేస్తున్నాడు. తమాన్‌ను పని నిమిత్తం ఏలూరు తీసుకువచ్చాడు. వీరిద్దరూ కలిసి రెస్టారెంట్ పైభాగంలోని గదిలో ఉంటున్నారు. ఈనెల 9న రాత్రి సోదరులిద్దరూ ఈగదిలో నిద్రించారు. శనివారం ఉదయం చూసేసరికి గది పక్కన ఉన్న బాత్‌రూంలో తమాన్ టవల్‌తో ఉరి వేసుకుని మృతి చెంది ఉన్నాడు. టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని సర్వజన ఆస్పత్రికి తరలించారు. తమాన్ మృతికి కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు చెప్పారు. హోటల్ యజమాని గుమ్మడి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ ప్రభాకర్ ఆదేశాలతో ఎస్సై సాధిక్ అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళా సంక్షేమానికి ఆసరా

మహిళల సర్వతోముఖాభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు తీసుకున్నారు. ప్రతి పథకంలోనూ మహిళలను భాగస్వామ్యం చేస్తూ వారి సాధికారతకు కృషిచేస్తున్నారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళలకు రుణమాఫీని వైఎస్సార్ ఆసరా సాయంగా అందిస్తున్నారు. జిల్లాలో నాలుగో విడత ఆసరా సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం ఏలూరు, ఉంగుటూరు, కైకలూరు నియోజకవర్గాల్లో ఆసరా కార్యక్రమాలు నిర్వహించారు.

– ఏలూరు (టూటౌన్)/భీమడోలు/కైకలూరు/కలిదిండి



ఏలూరు ఏఎస్‌ఆర్ స్టేడియంలో ఆసరా కార్యక్రమానికి హాజరైన మహిళలు

జగనన్న మేలు మరువలేం



మహిళలకు సీఎం జగన్ ఓ అన్నగా, కొడుకుగా, మనవడిగా చాలా మేలు చేశారు. మాది గోపాలపురం, వీరాంజనేయ గ్రూపు. మా గ్రూపు మొత్తానికి రూ.1.80 లక్షల రుణ మాఫీ జరిగింది. నాకు రూ.18 వేల లబ్ధి చేకూరింది. పేదల కష్టాలను తీర్చే సీఎం జగన్‌కు మహిళల దీవెనలు ఎప్పుడూ ఉంటాయి.

– రాజుల సూరమ్మ, గోపాలపురం

అప్పుల నుంచి గట్టెక్కాం



గత ప్రభుత్వం రుణమాఫీ చేస్తానని మాట తప్పడంతో డ్వాక్రా సంఘాలకు రుణ భారం పెరిగింది. సీఎం జగన్ చెప్పినట్టుగానే నాలుగు విడతలుగా రుణ మాఫీ చేశారు. మాది పెదలంక గ్రామం. శ్రీ నాగేశ్వర గ్రూపునకు రూ.96 వేల రుణ మాఫీ జరిగింది. మరోసారి ముఖ్యమంత్రి జగన్ రావాలని కోరుకుంటున్నాం.

– పోకల పద్మజ, పెదలంక

ప్రజారంజక పాలన

సీఎం జగన్ ప్రజారంజక పాలనను రాష్ట్రంలోని మహిళలంతా ఆశీర్వదించాలి. డ్వాక్రా రుణాలను పూర్తిగా మాఫీ చేసి మాట నిలబెట్టుకున్నారు.

–ఆళ్ల నాని, ఏలూరు ఎమ్మెల్యే

(ఏలూరులో శనివారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



ఏలూరులో మహిళలకు చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

మహిళలతోనే సమాజాభివృద్ధి

మహిళల ఆర్థిక స్వావలంబనతోనే సమాజాభివృద్ధి సాధ్యం. సీఎం జగన్ ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా మహిళల కుటుంబాలకు అండగా నిలిచారు.

– పుప్పాల వాసుబాబు, ఉంగుటూరు ఎమ్మెల్యే

(ఆగడాలలంకలో శనివారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



ఆగడాలలంకలో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎమ్మెల్సీ జయమంగళ, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్

హామీని నిలబెట్టుకుంటూ..

ఎన్నికల ముందు డ్వాక్రా సంఘాల మహిళలకు సీఎం జగన్ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ నాలుగో విడత ఆసరా సాయం అందించారు.

– దూలం నాగేశ్వరరావు, కైకలూరు ఎమ్మెల్యే

(కలిదిండిలో శనివారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



కలిదిండిలో మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్ యాదవ్

నిర్దిష్ట లక్ష్యాలను ఏర్పరుచుకోవాలి



బాలల కమిటీ సభ్యులతో ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బాలలు చదువుపై శ్రద్ధ వహించి, నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్ సూచించారు. స్థానిక వన్‌టౌన్ ప్రాంతంలో హోటల్ ఆదిత్య సెంట్రల్ సమావేశ మందిరంలో శనివారం చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ క్రాఫ్ట్ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి బాల పంచాయతీ, బాలల సంబంధిత కమిటీ సభ్యుల ముఖాముఖీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ బాలలు సెల్‌ఫోన్ వినియోగం, సోషల్ మీడియాతో భవిష్యత్తును పాడు చేసుకుంటున్నారన్నారు. 18 ఏళ్లలోపు వారు వాహనాల నడపటం సరికాదన్నారు. ఉమెన్, చైల్డ్ డెవలప్‌మెంట్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఇన్‌చార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ బాల్య వివాహాల నివారణకు కృషిచేయాలన్నారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు పి.వెంకటేశ్వరరావు, యాపిల్ ఆర్గనైజేషన్ డైరెక్టర్ జె.శివకృష్ణ, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ కౌన్సిలర్ యు.బాలస్వామి, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జ్యోతిబాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన పదేళ్ల బాలిక స్థానికంగా పాఠశాలలో 3వ తరగతి చదువుతుంది. బాలిక ఇంటి నుంచి పాఠశాలకు వెళుతున్న సమయంలో 45 ఏళ్ల వయసున్న ఎస్‌కే ఇబ్రహీం అనే వ్యక్తి చాక్లెట్ ఇస్తానని పిలిచి లైంగికంగా అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ విషయాన్ని బాలిక తన అమ్మమ్మకు తెలియజేయడంతో శనివారం ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

గుండెపోటుతో భక్తుడి మృతి

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలోని అనివేటి మండపంలో ఓ భక్తుడు గుండెపోటుకు గురై శనివారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఆకివీడుకు చెందిన కె.రాంబాబు (40) శ్రీవారి దర్శనార్థం కుటుంబ సమేతంగా ద్వారకాతిరుమలకు వచ్చారు. దర్శనం అనంతరం అనివేటి మండపంలోకి చేరుకున్న రాంబాబు అకస్మాత్తుగా గుండెపోటుకు గురై అక్కడే కుప్పకూలి పడిపోయాడు. వెంటనే కుటుంబ సభ్యులు అతడిని అంబులెన్స్‌లో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యుడు రాంబాబు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం అదే అంబులెన్స్‌లో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించారు.

విద్యుత్ శాఖ అధికారులపై ఎమ్మెల్యే మండిపాటు

నూజివీడు: వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరైనా విద్యుత్ లైన్ ఏర్పాటులో మునునూరు ట్రాన్స్‌కో అధికారుల జాప్యంపై ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మండిపడ్డారు. కార్యాలయానికి శనివారం సెలవు కావడంతో స్థానిక ఈఈ ఎ.సత్యన్నారాయణ ఇంటికి వెళ్లి విద్యుత్ లైన్‌ను కాంట్రాక్టర్‌తో తక్షణమే నిర్మింపచేసి కనెక్షన్ ఇవ్వాలని, లేకపోతే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. వివరాలిలా ఉన్నాయి. మునునూరు మండలం చిల్లబోయినపల్లికి చెందిన రైతు ఎం.శ్రీనివాసరావుకు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరైంది. 20 రోజుల క్రితమే స్తంభాలను కాంట్రాక్టర్ ఏర్పాటు చేశారు. లైన్ లాగడానికి కాంట్రాక్టర్ కూలీలు వెళ్లగా వేరే రైతు అడ్డుకుంటున్నాడు. దీంతో పనులు నిలిచిపోయి శ్రీనివాసరావుకు చెందిన నాలుగు ఎకరాల్లో ఆయిల్ పామ్ చెట్లు, మొక్కజొన్న పంట సాగునీరు లేక దెబ్బతినే స్థితికి చేరింది. రైతు 20 రోజుల క్రితమే ఈ పరిస్థితిపై ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి ఈఈ సత్యన్నారాయణకు చెప్పి సమస్యను పరిష్కరించాలని సూచించారు. అధికారులు, కూలీలకు రైతు లైన్‌ను లాగనివ్వ లేదు. దీంతో శనివారం రైతు శ్రీనివాసరావు మరోసారి ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే ప్రతాప్ ఈఈ ఇంటికి వెళ్లి రైతు అడ్డుకోవడం వల్ల పనులు నిలిచిపోవడమేమిటని ప్రశ్నించారు. రూ.2 లక్షలు పెట్టుబడి పెట్టాడని, పంట ఎండిపోతే నష్టం ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. ఈ పరిస్థితిలో అవసరమైతే పోలీసుల సహకారం తీసుకునైనా ఆదివారం సాయంత్రం కల్లా విద్యుత్ లైన్ లాగిస్తామని ఎమ్మెల్యే ప్రతాప్‌కు ఈఈ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యన్నారాయణ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు శీలం రాము, నాయకులు పాలడుగు విజయ్‌కుమార్, పల్లె రవీంద్రరెడ్డి తదితరులు ఉన్నారు.



ట్రాన్స్‌కో ఈఈ సత్యనారాయణను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే మేకా ప్రతాప్

స్కూల్ బస్సుకు తప్పిన ప్రమాదం

ద్వారకాతిరుమల: బుట్టాయిగూడెం వద్ద హైవేపై శనివారం ఒక లారీ స్కూల్ బస్సును వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సులో ఉన్న విద్యార్థులకు ఏ ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. దూబచర్లలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన స్కూల్ బస్సు గుణ్ణంపల్లిలో విద్యార్థులను ఎక్కించుకుని బుట్టాయిగూడెం వైపు వెళుతోంది. అదే సమయంలో ఒడిశా నుంచి ఫర్నిచర్ లోడుతో విజయవాడ వెళుతున్న లారీ ఘటనా స్థలం వద్ద స్కూల్ బస్సును వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బస్సు అద్దాలు పగిలిపోగా, లారీ ముందు భాగం దెబ్బతింది. ఆ సమయంలో బస్సులో ఉన్న 30 మంది పిల్లలు ఉండగా, వీరు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఏడుస్తూ రోడ్డుపైకి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఘటనా స్థలం వద్దకు చేరుకుని పిల్లలను ఇళ్లకు తీసుకువెళ్లారు.



ఘటనా స్థలానికి చేరుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

ద్వారకాతిరుమల: కొమ్మరలో విద్యుత్ లైన్ నిర్మాణం కోసం స్తంభం ఎక్కిన ఓ యువకుడు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. వెస్ట్ బెంగాల్ కు చెందిన యువకుడు బ్రోజన్ (22) ఒక కాంట్రాక్టర్ వద్ద విద్యుత్తు లైన్ల నిర్మాణ పనులు చేస్తున్నాడు. కొమ్మరలోని ఒక సెల్ ఫోన్ టవర్ వద్ద ఉన్న విద్యుత్ లైన్‌ను మార్చేందుకు బ్రోజన్ విద్యుత్ స్తంభం ఎక్కాడు. కొమ్మర, రాళ్లకుంట ఫీడర్‌కు చెందిన లైన్‌లు ఉండగా, బ్రోజన్ కొమ్మర ఫీడర్‌కు మాత్రమే ఎల్‌సీ తీసుకున్నాడు. అయితే స్తంభం ఎక్కిన అతడు రాళ్లకుంట ఫీడర్ వైర్లను పట్టుకోవడంతో షాక్‌కు గురై స్తంభం పైనే మృతి చెందాడు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందకు దింపారు. భీమడోలు సీఐ భీమేశ్వర రవికుమార్, ద్వారకాతిరుమల ఎస్సై సతీష్ మృతదేహాన్ని పరిశీలించి, పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



విద్యుత్ స్తంభంపై వేలాడుతున్న బ్రోజన్ మృతదేహం